

5లో..

గీత కార్మికులకు
## రక్షా కవచాలు
- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- 85మందికి పంపిణీ

# వరంగల్ వాయిస్
*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 26
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
అక్టోబర్ 08, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# 2.5 కోట్లు వృథా..

## చెరువులు పచ్చగా.. గుర్రపు డెక్క నిండుగా
### ఎఫ్ టీసీని అల్లుకుంటున్న లతలు
### ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు
### చర్యలు చేపడుతామన్న ఎమ్మెల్యే నాయిని

నీటితో దర్శనమివ్వాల్సిన చెరువులు, కుంటలు ఆకుపచ్చ రంగులో కనిపిస్తున్నాయి. అసలు చెరువుల్లో నీరు ఉందా అన్న అనుమానం కలిగించేలా గుర్రపు డెక్క విస్తరించింది. దీంతో చెరువుల్లోని నీరు కలుషితంగా మారడంతో జలచరాలకు ప్రాణాంతకంగా మారుతోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా తెలుగింటి ఆడపడుచులు ఆడి పాడిన తర్వాత నీటిలో నిమజ్జనం చేద్దామన్నా గుర్రపు డెక్క అడ్డంకిగా మారింది. దీనిని తొలగించాల్సిన బల్దియా పాలక వర్గం చేతులుడిగి చోద్యం చూస్తోంది. గుర్రడెక్క తొలగించేందుకు రూ. 2.5కోట్లతో బల్దియా కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్ (ఎఫ్ టీసీ) ని ట్యాంక్ బండ్ పరిసరాల్లోని భద్రకాళి చెరువులో మూలకు పెట్టగా దానిని సైతం గుర్రపు డెక్క కమ్ముకుని బల్దియా అధికారులకే సవాల్ విసురుతున్నట్లుగా మారింది. బతుకమ్మ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ట్యాంక్ బండ్ ను విజిట్ చేసిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముళ్ల పొదల మాటున ఉన్న ఎఫ్ టీసీని చూసి సీరియస్ అయ్యారు. ప్రజా ధనం దుర్వినియోగం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అధికారికి అక్కడినుంచే ఫోన్ చేసి గుర్రపు డెక్కను తొలగించాలంటూ ఆదేశించారు. –వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు2లో..





## జోగులాంబకు పట్టువస్త్రాలు
- సమర్పించిన మంత్రి కొండా సురేఖ
- పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు

అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన జోగులాంబ అమ్మవారికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారి దీవెనలు అందుకున్నారు. జోగులాంబ గద్వాల్ జిల్లా ఆలంపూర్ లోని జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానానికి మంగళవారం చేరుకున్న మంత్రికి అర్చకులు వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారిని మంత్రి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
– వరంగల్ వాయిస్, గద్వాల




2లో..

## ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ సంబురాలు
- కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి
- ఘనంగా బతుకమ్మ సంబరాలు

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, అక్టోబర్ 08, 2024

# రూ.2.5 కోట్లు వృథా

- చెరువులు పచ్చగా
- గుర్రపు డెక్క నిండుగా
- ఎఫ్ టీసీని అల్లుకుంటున్న లతలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు
- చర్యలు చేపడుతామన్న ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హంటర్ రోడ్డు :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 31వ డివిజన్ న్యూ శాయంపేట భద్రకాళీ బండ్ పై వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మంగళవారం పర్యటించారు. ఉదయం వేళ వాకర్స్ తో కలిసి భద్రకాళి బండ్ ఆవరణ మొత్తం పరిశీలించారు. బొంది వాగు నాలా డైవర్షన్ పై ప్రత్యామ్నాయ మార్గం చేయాలనీ తెలిపారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైనా వాతావరణం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చెరువులు అక్రమణకు గురికాకుండా చూడాల్సిన అవసరం ప్రజలపై ఉన్నదని తెలిపారు. భద్రకాళి బండ్ సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని, భద్రకాళి చెరువు పరిసర ప్రాంతాలు ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### ఎఫ్ టీసీపై ఆగ్రహం..

గుర్రపు డెక్కను తొలగించేందుకు తొలగించేందుకు కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్ (ఎఫ్ టీసీ)ను భద్రకాళి చెరువులో ఓ మూలకు పడేయడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ధనం దుర్వినియోగంపై మండి పడ్డారు. ఎఫ్ టీసీని కొనుగోలు చేసిన సంవత్సరం పాటు కంపెనీ ప్రతినిధులు భద్రకాళి, వడ్డేపల్లి చెరువుల్లోని గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను కొంత వరకు తొలగించారు. కంపెనీ ప్రతినిధులు వెళ్లి పోగానే గుర్రపు డెక్క తొలగించే యంత్రాన్ని మూలన పడేశారు. దీంతో అదే గుర్రపు డెక్క ఎఫ్ టీసీ కనిపించకుండా అల్లుకుపోయాయి. దీన్ని ప్రత్యక్షంగా చూసిన ఎమ్మెల్యే అక్కడినుంచే సదరు అధికారికి ఫోన్ చేసి వివరాలు సేకరించారు. యంత్రాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.



### గుర్రపు డెక్క తొలగిస్తాం..

భద్రకాళి చెరువులో విస్తరించి ఉన్న గుర్రపు డెక్కను తక్షణమే అధికారులు తొలగించాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగ సమీపించిన వేళ మహిళలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. వాకర్స్ తో సరదాగా ముచ్చటించారు. అనంతరం 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు సమాచారంతో కనక దుర్గా కాలనీలోని కనక దుర్గ దేవాలయం అభివృద్ధిలో భాగంగా రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శివశంకర్, డివిజన్ అధ్యక్షులు సురేందర్, సీనియర్ నాయకులు రమేష్, కృష్ణ, వేణు, రమేష్, వాకర్స్, స్థానిక కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పారా ఒలింపిక్ విజేత దీప్తికి సన్మానం

### అభినందించిన కలెక్టర్లు

***వరంగల్ వాయిస్, వరంగల్ :*** ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, పారా ఒలింపిక్స్ లో కాంస్య పథకం విజేత జీవంజి దీప్తిని వరంగల్, హనుమకొండ కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య ఘనంగా సత్కరించారు. మంగళవారం నగరానికి విచ్చేసిన వీరు వరంగల్, హనుమకొండ కలెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల బొకే ఇచ్చి శాలువాలతో సత్కరించారు. భారతదేశానికి క్రీడారంగంలో పథకం సాధించడానికి కృషి చేసిన గురు, శిష్యులిద్దరూ వరంగల్ వాస్తవ్యులే కావడం గర్వకారణం అన్నారు. దేశ కీర్తి, ప్రతిష్టలను ప్రపంచానికి చాటిన వీరి క్రీడా నైపుణ్యం యువతకు స్ఫూర్తి దాయకం అన్నారు. వరంగల్ లో జరిగిన కార్యక్రమంలో డీవైఎస్ఓ సత్యవాణి, వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్ యాదవ్, వరంగల్ జిల్లా కోకో అసోసియేషన్ సెక్రటరీ శ్రీశైలం, వరంగల్ జిల్లా క్రికెట్ కోచ్ సుమన్ తదితరులు పాల్గొనగా హనుమకొండ కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాధికారి అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.





# ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మసంబురాలు

- కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి
- ఘనంగా బతుకమ్మ సంబరాలు

**వరంగల్ వాయిస్, కేయూ :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర మహిళా ఉద్యోగుల సారథ్యంలో మంగళవారం ఉదయం పరిపాలన భవన ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులను ఉద్దేశించి మల్లారెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణ మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో, నియమ నిష్టలతో నిర్వహించే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు. మనలో ఉత్సాహం నింపటంతో పాటు, మనో ధైర్యం, విజయ కాంక్ష చేకుర్చాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాలక మండలి సభ్యులు డాక్టర్ బి.రమ మాట్లాడుతూ మహిళలందరూ ఉత్సహంగా పాల్గొని, సంతోషాన్ని పంచుకునే పండుగ బతుకమ్మ అన్నారు. డాక్టర్ బి.సుకుమారి మాట్లాడుతూ విద్యార్థినిలందరూ సమష్టిగా జరుపుకోవాలి పండుగ బతుమ్మ అని వివరించారు. కె.అనితా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పల్లె, పట్టణం, ధనిక, బీద అనే తేడా లేకుండా జరుపుకునే పండుగ అన్నారు. మన ఆత్మ గౌరవం పెంపొందించే పండుగ అన్నారు. డాక్టర్ ఎస్.సుజాతతో పాటు ఆర్. శ్రీలత దేవి, బి.సృజన, బి.కృష్ణ వేణి, పి.నర్మద, కె.శ్రీలత, రమ, పద్మ, రజిత, విజయలక్ష్మి ఆటపాటలతో, లయబద్ధంగా, కోలటాలతో, సాంప్రదాయ బతకమ్మ పాటలకు లయబద్ధంగా నృత్యాలు వేస్తూ పాలక మండలి సభ్యురాళ్లు డాక్టర్ బి.రమ, డాక్టర్ బి.సుకుమారి, కే.అనితారెడ్డితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దూర విద్య సంచాలకులు ఆచార్య వి.రామచంద్రం, మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు, ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, సహాయ రిజిస్ట్రార్ లు లింగంపల్లి రాము, ప్రణయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రసాదవితరణ నిర్వహించారు.



## మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ గా వెంకటరత్నం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ గా జె.వెంకటరత్నం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ముగ్గురు ఇన్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. ఇందులో భాగంగానే వెంకటరత్నం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్ చేశారు.



## ఆగని ఇసుక దందా

**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** టేకుమట్ల మండల కేంద్రంలోని చలి వాగు నుంచి కొందరు దుండగులు అక్రమంగా రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లల్లో ఇసుక రవాణా చేస్తున్నారు. మరి కొందరు అయితే సమయపాలనతో సంబందం లేకుండా జేసీపీ సహాయంతో వాగులో ఇసుకను ట్రాక్టర్ లల్లో నింపి రవాణా చేస్తున్నారు. అయితే ఈ అక్రమ ఇసుక రవాణాను ఏ ఒక్క అధికారి పట్టించుకోవడం లేదు. అటు రెవెన్యూ శాఖ, ఇటు పోలీస్ శాఖ పట్టించుకోకుండా వ్యవహరించడంపై ప్రజలు నివ్వెర పోతున్నారు. ఇప్పటికైనా దీనికి సంబంధించిన ఉన్నతాధికారులు అక్రమ ఇసుక రవాణాపైన చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సభ్యత్వ నమోదుపై సమీక్ష



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** జిల్లా భారతీయ జనతా పార్టీ, వర్ధన్నపేట నియోజకవర్గం, వర్ధన్నపేట రూరల్, పట్టణ మండల బీజేపీ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు కార్యక్రమంపై వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వరకు జరిగిన సభ్యత్వాలు, లక్ష్యానికి అనుగుణంగా జరగాల్సిన సభ్యత్వ నమోదుపై కార్యాచరణ గురించి చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి, సభ్యత్వ సహా ప్రముఖ్ జడ సతీష్, వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజు కుమార్, మండల అధ్యక్షులు రాయబారపు కుమారస్వామి, బీజేపీ నాయకులు మైస రాజు, యాకన్న, అనుకుంట్ల శ్రీను, అయిత రవి, గిరిధర్, మండల శక్తికేంద్ర, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## కండక్టర్ సాంబయ్య నిజాయితీ



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక డిపో ఆర్టీసీ కండక్టర్ గా పనిచేస్తున్న కోడపాక సాంబయ్య అనే వ్యక్తి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. పరకాల పట్టణ డిపోకు చెందిన బస్సు కండక్టర్ తన బస్సులో నాగరం గ్రామానికి చెందిన బిల్లా రాజేశ్వరి మొగుళ్లపల్లి-జమ్మికుంట బస్సు పరకాలలో ఎక్కి నాగారం గ్రామంలో తన పిల్లలతో దిగి తన బ్యాగును మర్చిపోయింది. కండక్టర్ బస్సులో ఉన్న బ్యాగును గమనించి పరకాల డిపో మేనేజర్ కు సమాచారం ఇచ్చి బాధితులకు తమ బ్యాగును అప్పచెప్పి తన నిజాయితీని చాటుకున్నారు. ఆ బ్యాగులో రూ.30వేల నగదు, మూడు తులాల బంగారం, 20 తులాల వెండితో పాటు ఒక మొబైల్ ఫోన్ ఉంది. నిజాయితీగా వ్యవహరించిన బస్ కండక్టర్ సాంబయ్యను డిపో మేనేజర్ అభినందించారు.

## కమలాపూర్ వరలక్ష్మి రైతు సేవక్ సంఘం అధ్యక్షుడిగా బొయిని సాంబయ్య





**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలోని గుడిబండ వద్ద కూరగాయలు విక్రయించుకునే చిరు వ్యాపారులు కలిసి కమలాపూర్ వరలక్ష్మి రైతు సేవక్ కూరగాయల అమ్మకందారుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనికి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడిగా బోయిని సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా వొడ్డె రమేష్, ప్రధాన కార్యదర్శిగా బుర్రి సాంబమూర్తి, సంయుక్త కార్యదర్శిగా పెరుమాళ్ల గౌరమ్మ, కోశాధికారిగా వొడ్డే సాంబయ్య ఎన్నియ్యారు.

## తహసీల్దార్ విధులను అడ్డుకున్న వారిపై కేసు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సార్ నగర్‌లో బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాటు కోసం ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమి స్థల పరిశీలనకు వరంగల్ మండల తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, వారి సిబ్బందితో స్థల పరిశీలనకు వెళ్లగా ఎస్సార్ నగర్ కు చెందిన కేతిరి రాజశేఖర్, కేతిరి లావణ్య అక్కడి ప్రజలను మహిళలను రెచ్చగొట్టి అధికారులు ఇండ్లు కూల్చి వేస్తున్నారని తప్పుడు సమాచారం ఇచ్చి వారందరిని తీసుకుని వచ్చి ప్రభుత్వ అధికారులను అడ్డుకున్నారు. దీంతో వారిపై దాడికి ప్రయత్నించినారని వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్ ఫిర్యాదు చేయగా పై వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఎవరైనా సరే ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించినట్లయితే వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ ఏ.రాఘవేందర్ తెలిపారు.

## జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం




**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కొంపల్లిలో జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం లో వరంగల్ జిల్లా చైర్మన్ చంద్రగిరి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ గంగుల అశోక్, నాగరాజులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర చైర్మన్ బద్దిబడగ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి అక్రమాలను వెలికి తీసి న్యాయస్థానాల ద్వారా అరికట్టడం, ప్రతి నిరుపేద సామాన్యులకు న్యాయసలహాలు సేవలు అందివ్వడం, ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం అలాగే పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు దక్కేల కృషి చేయడం, విద్య వైద్యంలో ఉన్న లోపాలు గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తూ ప్రమాణాలు మెరుగుపరచటకు కృషి చేయడం, మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించడం ప్రభుత్వ ప్రజా ఆస్తులు కాపాడడం ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడడం ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అసమర్ధ అధికారులను ఆధారాలతో ని నిరూపించి సమాజంలో దోషులుగా చూపడం అవినీతి అక్రమాలపై రాజీలేని పోరాటం ప్రొసీజర్ తో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా చైర్మన్ సునీల్ కుమార్ చంద్రగిరి మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షులు చేసిన చర్చలు, ఇచ్చిన సలహాలు, సూచనలు పాటిస్తూ, సంస్థ కోసం, సంఘం కోసం, సమాజ హితం కోసం, నీతి నిజాయితీగా ఉంటూ,పేదలకు నిస్వార్ధ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వానికి, అధికారులకు వారధిలా ఉంటూ, అవినీతి అంతం..ఎన్ హెచ్ ఆర్సీ పంతం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలినేని లక్ష్మి, వరంగల్ జిల్లా కన్వీనర్ యశోద, జ్యోతి, ఇందిర, శ్రీధర్, వివిధ జిల్లాల చైర్మన్లు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

## బతుకమ్మ, దసరా ఏర్పాట్లు ఘనంగా చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో రాబోయే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై మంగళవారం అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో, ఎంపీవోలతో పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ, దసరా పండుగకు గ్రామాల్లో ప్రస్తుతం ప్రజా ప్రతినిధులు లేనందున మీరే పూర్తి బాధ్యతలు తీసుకొని గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళలు బతుకమ్మ ఆడుకునే స్థలంలో పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామాల్లో కూడా వీధులన్నీ క్లీన్ చేసి వీధి దీపాలు కూడా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓ, ఎంపీఓలు పాల్గొన్నారు.

## వృద్ధులకు వైద్య ఆరోగ్య శిబిరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ ఆధ్వర్యంలో మంగళవారం భీమదేవరపల్లి మండలంలోని బొల్లోనిపల్లి గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ ఆదేశానుసారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గం మాట్లాడుతూ హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ మంగళవారం బోలనపల్లి గ్రామంలో బీపీ షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరిగిందన్నారు. ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాల్లోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బొల్లి సుమన్ అధ్వర్యంలో జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జె.కిషన్ రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, క్రాంతి, సతీష్, జక్కోజు నరసింహ చారి, పోశాలు,కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ గోనెల సంపత్, పొన్నం వనజ, గ్రామస్తులు పి.గోపాల్ రావు, గోవింద రావు, మేడబోయిన పద్మ, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో 72 మందికి షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## మెడికల్ కాలేజీకి పార్థీవదేహం అప్పగింత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్తవాడ నివాసి విష్ణు దాసు గోపాల్ రావు (65) అనారోగ్యంతో ఎంజీఎం హాస్పిటల్ వరంగల్ లో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. కుటుంబ సభ్యులు సోదరులు రామ్మోహన్రావు, వెంకటేశ్వరరావు, మనుమడు, మనవరాలు విశాల భావంతో స్వచ్ఛందంగా నేత్ర, శరీర దానానికి ముందుకు రాగా, “తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ “ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో పార్థీవ దేహాన్ని, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ కు అనాటమీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ స్రవంతి, అనాటమీ సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, సతీష్ లకు పార్థివ దేహాన్ని అప్పగించారు. ఈ పార్థీవదేహం మెడికల్ విద్యార్థులకు వైద్య చదువుతో పాటు, శాస్త్ర పరిశోధనకు ఉపయోగపడుతుందని అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. తదనంతరం వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణులు లక్ష్మణ్ ద్వారా నేత్ర కార్నియా సేకరణ నేత్రదానం చేశారు. ఈ నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపునిచ్చిన వారయ్యారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నర్సంపేటకు రెండవ పార్థీవ దేహాన్ని అందించిన కుటుంబ సభ్యులకు, అసోసియేషన్ ప్రతినిధులకు ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ దాస్ ధన్యవాదాలు తెలిపారు. పార్థీవ దేహాన్ని ప్రస్తుతం కాకతీయ మెడికల్ కాలేజ్ వరంగల్ లో ఎంబాలింగ్ ( పార్థీవ దేహంలో కెమికల్ తో కూడిన ఇంజక్షన్ ఇచ్చి శుద్ధి చేయడానికి) నిమిత్తం అప్పగించడం జరిగింది. నర్సంపేట మెడికల్ కాలేజీలో ఈ సౌకర్యం ప్రస్తుతం లేనందున కేఎంసీకి అప్పగించారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు శంకరమూర్తి, పద్మ, ప్రజ్ఞ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, డి.రాజమౌళి, ఉపాధ్యక్షుడు కే.శంకర్రావు యాదవ్, ప్రధాన కార్యదర్శి, మొహీనుద్దీన్ జాయింట్ సెక్రటరీ, సలహాదారు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బుగులోని వేంకటేశ్వరస్వామి జాతరకు బీటీ రోడ్లు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, కొత్తపల్లిగోరి/రేగొండ :** వచ్చే నెల 14 నుంచి బుగులోని వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని, జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అందులో భాగంగా జాతరకు వచ్చే నాలుగు వైపులా రూ.541.75 లక్షలతో కొత్తగా బీటీ రోడ్లు వేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట, రేగొండ మండలం తిరుమలగిరి, పాండవులగుట్ట, నారాయణపూర్ ఎస్సీ కాలనీలల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ బుగులోని జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూ.541.75 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్లలో రూ.115 లక్షలతో జగ్గయ్యపేట నుంచి బుగులోని జాతర వరకు, రూ.136 లక్షలతో తిరుమలగిరి నుంచి బుగులోని జాతర వరకు, రూ.205 లక్షలతో నారాయణపూర్ ఎస్సీ కాలనీ నుంచి పాండవుల గుట్ట మీదుగా బుగులోని జాతర వరకు, రూ.85 లక్షలతో పీడబ్ల్యూ రోడ్డు రావులపల్లి నుంచి పాండవుల గుట్ట వరకు, అదేవిధంగా, బుగులోని గుట్టపైకి వెళ్లే మెట్ల పునరుద్దరణ పనులకు రూ.2 లక్షలతో త్వరలోనే పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# ఘనంగా దుర్గా మాతకు కుంకుమ పూజ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక బస్టాండ్ రోడ్డులో ఆకుల వాడ మహిళలచే ప్రతిష్ఠించబడిన దుర్గా మాత నవరాత్రులలో భాగంగా 6వ రోజు మంగళవారం అర్చకులు సునీల్ శర్మ మహిళాలచే కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో ఈ కుంకుమ పూజలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నీలారపు శ్రీదేవి, గందే కమల, ఆకుల అనురాధ, దేవులపల్లి లలిత, ఆకుల అనిత, నీలారపు వాణి, సల్లా పద్మ, బిందు తదితరులు పాల్గొన్నారు.

# అపార్ట్ మెంట్‌లో అగ్ని ప్రమాదం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించి అపార్ట్ మెంట్ లోని ఓ ఫ్లాట్ లో విలువైన వస్తువులు, డాక్యుమెంట్స్, బంగారు, వెండి వస్తువులు దగ్ధమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక కంకర బోడు ప్రాంతంలో గల ఎస్వీ టవర్స్ మూడు అంతస్తులలోని 303 అపార్ట్మెంట్ లో పొగలు రావడాన్ని గమనించిన అపార్ట్మెంట్ వాచ్ మెన్, వాచ్ మెన్ భార్య అపార్ట్ మెంట్ లోని వారందరికీ తెలిపారు. వెంటనే అందరూ పరుగులు తీశారు. పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెంటనే ఫైర్ ఇంజిన్ చేరుకున్నా ఫలితం లేకపోయింది. ఫైర్ ఇంజిన్ మొరాయించడంతో అపార్ట్ మెంట్ వాసులు బకెట్లు, పైపులతో ఎగిసిపడుతున్న మంటలను ఆర్పి వేశారు. మరిపెడ నుంచి ఒక ఫైర్ ఇంజిన్, డోర్నకల్ నుంచి మరో ఫైర్ ఇంజిన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను మిగతా ఫ్లాట్స్ కు వ్యాపించకుండా శ్రమించారు. 303 ఫ్లాట్ లో ఉంటున్న జీవిత అనే బ్యాంక్ ఉద్యోగి ఉదయం ఫ్లాట్ కు తాళం వేసి బ్యాంకుకు వెళ్లింది. 12:30 సమయంలో విషయం తెలుసుకొని ఇంటికి చేరుకునే సరికి ఫ్లాట్ లోని వస్తువులు అన్నీ దగ్ధమయ్యాయని , ఫైర్ ఇంజిన్ మోరాయించడంతోనే సర్టిఫికెట్లు , వస్తువులు, 30 తులాల బంగారం, వెండి అన్ని దహనమయ్యాయని దీనికి ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలనుఅడిగితెలుసుకున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెల్లికుదురు, గూడూర్, కేసముద్రం, మహబూబాబాద్ మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం మహబూబాబాద్ శాసనసభ్యుడు డాక్టర్ భూక్యా మురళి నాయక్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు, మహబూబాబాద్ నియోజకవర్గ 4 మండలాల అధ్యక్షులు, జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు అస్తిత్వానికి ఆద్యుడు పాల్కురికి

## తెలుగు విశ్వవిద్యాలయానికి సోమనాథుని పేరే తగినది

## ప్రముఖ కవి విశ్వనాథుల పుష్పగిరి



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** సాహిత్యంలో తెలుగు భాష గురించి తొలుత ప్రస్తావించి గుర్తింపు తెచ్చినది మహాకవి పాల్కురికి సోమనాథుడే అని విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వ్యవస్థాపకుడు, ప్రముఖ కవి విశ్వనాథుల పుష్పగిరి అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తిలోని పాల్కురికి సోమనాథుని స్మృతి వనాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ. సోమనకు ముందటి కవులు ఆంధ్రం అనగా, సోమన మాత్రమే తెలుగు మాటలు, జాను తెనుగు అనే పదాలను తన కావ్యాలలో రాశాడని స్పష్టం చేశారు. భాషగా తెలుగు అస్తిత్వానికి ఆద్యుడైన పాల్కురికి సోమనాథుని పేరే తెలుగు విశ్వవిద్యాలయానికి తగినదని ఈ సందర్భంగా పుష్పగిరి నొక్కి చెప్పారు. ఆయన వెంట దేవస్థానం సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సోమనాథ కళా పీఠం అధ్యక్షుడు రాపోలు సత్యనారాయణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గూడూరు లెనిన్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు మేరుగు మధుసూదన్, గాంధారి శ్రీనివాస్, గొల్లపల్లి రాజశేఖర్ ఉన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో నిత్యం రోగుల ఆర్తనాదాలతో దద్దరిల్లే ఆస్పత్రి నేడు బతుకమ్మ పాటలు కోలాటాలతో కళకళలాడింది. నిత్యం రోగులకు చికిత్స చేస్తూ మందులతో కుస్తీపడే వైద్య సిబ్బంది నేడు సరదాగా బతుకమ్మ ఆడారు. ఉమ్మడి రేగొండ మండల కేంద్రంలోని స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం వైద్య సిబ్బంది బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించి సంబరాలు జరిపారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలాడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్.హిమబిందు మాట్లాడుతూ ప్రపంచంలో పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ పండుగని, తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అని, ప్రపంచవ్యాప్తంగా వందకు పైగా దేశాలు ఉన్న ఆశ్వీయుజ మాసంలో బతుకమ్మ పండుగను నిర్వహించడం తెలంగాణకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశలు, ఫార్మా సిస్టర్, శానిటేషన్ సిబ్బంది, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు

# కరెన్సీ వెలుగులో అమ్మవారు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మరిపెడ మండలం గుండెపూడి గ్రామంలో అమ్మవారిని 6వ రోజు శ్రీమహాలక్ష్మి దేవిగా లంకరించారు. ఏడులక్షల ఏడు వేల నూటపదహారు రూపాయల కొత్త కరెన్సీ తో అలంకరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పువ్వాడ హరిప్రసాద్ దంపతులు, గ్రామ పెద్దలు అందరు పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలను వేద పండితులు, సముద్రాల వెంకట లక్ష్మి నరసింహ చార్యులు నిర్వహించారు.

# గురువారం సద్దుల బతుకమ్మ, శనివారం దసరా

## నిర్ణయించిన వేద పండితులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజలు సద్దుల బతుకమ్మ, దసరా జరుపుటకు ప్రజలు సందిగ్గంతో ఉన్నారని దీనికి వేద పండితులు సరైన రోజు నిర్ణయించారు. 10 గురువారం సద్దుల బతుకమ్మ, 12న శనివారం దసరా జరుపుకోవాలని కుంకుమేశ్వర అర్చకులు నాగభూషణం శర్మ, సంపత్ శర్మ వివరించారు. సద్దుల బతుకమ్మను కుంకుమేశ్వర ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఏర్పాట్లు చేశారని, దసరా ఉత్సవాలను పశువుల సంతలో ప్రభుత్వం తరపున ఏర్పాటు చేయడం జరిగిందని పరకాల ఎమ్మెల్యే, పురపాలక చైర్మన్, కౌన్సిలర్లు తెలియజేశారు. సద్దుల బతుకమ్మ, దసరాను ఆనందోత్సవాల నుడమ జరుపుకోవాలని ప్రజలను కోరారు.

# ఘనంగా చండీ హెూమం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగమంలో కాకతీయులచే కొలువబడిన భువనేశ్వరి సర్వేశ్వర స్వామి(రంగంపేట శివాలయంలో) దేవీ శరన్నవరాత్రులలో భాగంగా 6వ రోజు అమ్మవారిని కాత్యాయని క్రమంతో అర్చన భవానిగా అలంకరించి చండీ హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య దాతలుగా కొయ్యడ భరత్ దంపతులు, రాజశేఖర్ దంపతులు, పరమేశ్వర్ దంపతులు, ఓరుగల్లు వెల్ఫేర్ అసోసియేషవ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి మద్ది రాజబాబు, కోశాధికారి నాగమల్ల సర్వేశం, కార్యవర్గ సభ్యులు కొడకండ్ల రంగయ్య, శ్యాం నవీన, రమేష్, నరేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మాదారపు సదాశివుడు,ఆలయ అర్చకులు గోపికృష్ణ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను రక్షించుకుందాం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆడ పిల్లలను బతికించుకుందాం' గోడపత్రికలను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో బతుకమ్మలను ఏ విధంగా అయితే మనం బతికించుకుంటున్నామో అదేవిధంగా ఆడపిల్లలను కూడా రక్షించుకోవాలన్నారు. డాక్టర్ నాగవాణి మాట్లాడుతూ ఆడపిల్లలను పుట్టనిద్దాం బతకనిద్దాం చదవనిద్దాం వారికి చక్కటి భవిష్యత్తును ఇద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్స్ డాక్టర్ డేవిడ్, డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ




**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని మేచరాజుపల్లి గ్రామంలో ఎల్తూరి పద్మ దశ దిన రోజున బంధుమిత్రులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు బొజ్జ భిక్షమయ్య, మేచరాజుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వెలిశాల లక్ష్మీదేవేందర్ రావు, రిటైర్డ్ హెడ్మాస్టర్ బందు నారాయణ, టీచర్ దిలీప్డాక్టర్ ఉపేందర్, వై.యాకయ్య తదితరులు హాజరయ్యారు. మృతి చెందిన పద్మపై అడగగానే కవిత రాసిన టీచర్ వీరస్వామి, పాట రాసిన గిద్దె రామ నర్సయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్మంలో ఎల్తూరి క్రాంతి, ఎల్తూరి ఉపేందర్, వెంకటసోములు, జెరుపోతుల మధు, జేరుపోతుల అయిలయ్య, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## సింగపురం ఇమ్మానుయేల్ రాజ్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసాని బొందయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పండుగలో స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర తనయుడు సింగపురం ఇమ్మానుయేల్ రాజ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. అనంతరం కాసాని బొందయ్య ఇమ్మానియేల్ రాజుకు శాలువాలతో సన్మానించారు. వీరి వెంట పట్టణ అధ్యక్షుడు నీల శ్రీధర్, తిరుమల దేవస్థానం చైర్మన్ నీలా నరసింహులు, వైస్ చైర్మన్ రేల సమ్మయ్య, చెల్పూర్ గుట్ట డైరెక్టర్ గట్టు ఎల్లయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు, జిల్లా కార్యదర్శి మౌనిక, పట్టణ మహిళా అధ్యక్షురాలు జ్యోత్స్న, రాజశేఖర్, బైకాని రాజు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను కొలిచే అత్యంత విశిష్టమైన పండుగన్నారు. ప్రతి సంవత్సరం ఆడబిడ్డలు అంతా ఒక్క దగ్గర ఉత్సాహంగా జరుపుకునే బతుకమ్మ పండుగను రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, ఈజీఎస్ సిబ్బంది, సెక్రటరీలు బతుకమ్మ పాటలతో డ్యాన్సులు నిర్వహించారు.

# మానవత్వంతో చేరదీస్తే మోసం చేయడం సరైంది కాదు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మానవత్వంతో చేరదీసి సహాయం చేస్తే మోసం చేయడం సరైనది కాదని, అలాంటి వారికి అండగా ఉండే వారు ఒకటి రెండు సార్లు ఆలోచన చేసి వాస్తవాలు తెలుసుకొని ముందుకు పోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణిగుంట్ల కొమరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల రాజు అన్నారు. భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలంలో ని రుద్రారం గ్రామంలో స్థల వివాదంపై స్పందించిన ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రారం గ్రామంలో చిన్నపెల్లి రాజేశ్వరి, రమాదేవి కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. వారికి ఉండడానికి ఇల్లు కూడా ఉన్నది రోడ్డు పక్కనే ఖాళీగా ఉన్న రామినేని నారాయణరావు స్థలంలో చిన్న కూరగాయలు, గాజుల కొట్టు పెట్టుకుంటామని ప్రాధేయపడగా మానవత్వంతో అవకాశం కల్పిస్తే ఇట్టి స్థలం మాదేనని దౌర్జన్యం చేయడం సరైనది కాదన్నారు. అదే విధంగా గ్రామంలోని కొంతమంది పేదలు కూడా అదే స్థలంలో జీవనోపాధి కోసం చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని బతుకుతున్నారని, నేడు ఆ భూమి యజమానులు కాళీ చేయమనగానే మిగతా వారంతా ఖాళీ చేశారని తెలిపారు. కానీ, పూసబెర్ల సాంబయ్య కుటుంబం మాత్రం ఖాళీ చేయడం లేదని, ఆ భూమి యజమానికి గిట్టని వారు కొంతమంది సాంబయ్య కుటుంబానికి అండగా ఉండి సమస్యను సృష్టించాలని చూడడం సరైనది కాదని హితవు పలికారు. మానవత్వంతో చేరదీస్తే స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం మంచిది కాదన్నారు. వారికి అండగా ఉండేవారు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకొని ముందుకు సాగాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి బస్టాండ్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో ప్రజలు అందరు కూడా భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ బి.సూర్యనారాయణ అన్నారు. ఎల్కతుర్తి బస్ స్టాండ్ లో దాదాపు 60 మంది ప్రయాణికులుకు సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రయాణికులుకు ఈవ్ టీజింగ్ గురించి, బస్సులో ప్రయాణిచ్చేటప్పుడు ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదన్నారు. టీ-సేఫ్ ఆప్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930కి ఫిర్యాదు చేయాలన్నారు. అన్నోన్ నెంబర్స్ నుంచి మహిళలకు ఇబ్బందులుకు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270 లకు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ కానిస్టేబుల్ కే. వంశీకృష్ణ, ఉమెన్ కానిస్టేబుల్ సువార్త, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్ఐ కనకసారయ్య, కానిస్టేబుల్ తిరుపతి హాజరయ్యారు.

## గీత కార్మికులకు భద్రత కిట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గీత కార్మికులకు కాటమయ్య రక్షా (భద్రత కిట్) కిట్లను మంగళవారం వరంగల్ ఎంపీ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ పంపిణీ చేశారు. హనుమకొండ, వరంగల్ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల నియోజకవర్గ పరిధిలో శిక్షణ పొందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షా (భద్రత కిట్ ) అందించారు. అనంతరం యాదగిరి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ (భద్రత కిట్ ) కిట్టులను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, పరకాల మున్సిపల్ చైర్ పర్సన్ సోదా అనిత రామకృష్ణ, బీసీ సంక్షేమ శాఖ హనుమకొండ జిల్లా డీడీ శ్రీ రామ్ రెడ్డి, శ్రీ కందాల శంకరయ్య, హనుమకొండ జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మురళీధర్ , పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ, కౌన్సిలర్ చిర్ర సదానందం గౌడ్, మాజీ కౌన్సిలర్ మేరుగు శ్రీశైలం గౌడ్, గీసుకొండ మాజీ ఎంపీపీ వీరగోని రాజు కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు మార్క కిరణ్ గౌడ్, చిర్ర సారంగపాణి గౌడ్, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తులకు సమాజసేవ శిక్ష



**వరంగల్ వాయిస్, కాజీపేట :** వరంగల్ పోలీస్ కమిషనర్ వరంగల్ ఆదేశాల మేరకు, కాజీపేట ట్రాఫిక్ పీస్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురు వ్యక్తులు కాజీపేట్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కడంతో రెండు రోజులు సమాజసేవ చేయాల్సిందిగా కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే లకావత్ చంప్లా, భూక్యా కొమురల్లి, నాయిని నరేష్, మ్రి చలపతిలు మద్యం సేవించి వాహనాలు నడుపుతూండగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో వాహనదారులను కాజీపేట ట్రాఫిక్ పోలీసులు పరీక్షించగా వాహనదారులు పెద్ద స్థాయిలో మద్యం సేవించినట్లుగా నిర్ధారణ అయ్యింది. దీంతో సదరు మద్యం సేవించిన వాహనదారులను మంగళవారం రెండవ తరగతి కోర్టు న్యాయమూర్తి కె.విద్యాసాగర్ రావు ఎదుట కాజీపేట ట్రాఫిక్ కోర్ట్ కానిస్టేబుల్ బి.కుమార్ హాజరు పర్చగా వాహనదారులు సేవించిన మద్యం మోతాదును పరిశీలించిన న్యాయమూర్తి మద్యం సేవించి వాహనం నడపడాన్ని నేరంగా పరిగణిస్తూ సదరు వాహనదారులను రెండు రోజులు సమాజసేవ చేయాల్సిందని తీర్పు ఇవ్వడంతో తీర్పును అనుసరించి స్థానిక కాజీపేట సర్కిల్ మున్సిపల్ కమిషనర్ ఎదుట హాజరు పరిచారు.

వరంగల్ వాయిస్ Evening Daily
మంగళవారం 08, అక్టోబర్ 2024
www.warangalvoice.net

# బీసీ హక్కుల సాధనకై అధ్యాపకులు పాటుపడాలి

## జేఏసీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీసీ హక్కుల సాధనకై అధ్యాపకులంతా కలిసి రావాలని బీసీ జేఏసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. హంటర్ రోడ్డులోని మాస్టర్ జీ కళాశాలలో వేణుమాధవ్ సభాధ్యక్షతన బీసీ అధ్యాపకుల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందర్ రాజు యాదవ్ మాట్లాడుతూ అధ్యాపకులు ఎంతో మంది విద్యార్థులకు రోల్ మోడల్ గా ఉన్నారని, అడుగడుగునా బీసీ అధ్యాపకులకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. బీసీలంతా ఐక్యంగా పనిచేస్తే మన హక్కులను సాధించడం చాలా సులభం అవుతుందన్నారు. ఇందుకోసం బీసీ జేఏసీని ఏర్పాటు చేసి, ప్రతి సంఘాన్ని కూడా ఇందులో భాగస్వామ్యం చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. బీసీ అధ్యాపకుల సంఘమే, కాకుండా వర్తక సంఘం, విద్యార్థి సంఘం, మహిళా సంఘం, అధ్యాపక సంఘం, డాక్టర్ల సంఘం, అడ్వకేట్ల సంఘం, వాకర్స్ అసోసియేషన్, ఈ విధంగా రకరకాల విభాగాలను ఇందులో వివిధ రకాల సంఘాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. త్వరలోనే బీసీ లెక్చరర్స్ ఫోరమ్ ను కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలను పరిగణలోకి తీసుకొని బీసీ హక్కుల కోసం అధ్యాపకులు ఏకమై ముందుకు నడిపించాలని కోరారు. బీసీల హక్కుల సాధనకై అనేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. ప్రతి కళాశాలకు వెళ్లి అధ్యాపకులను, విద్యార్థులను బీసీలకు జరిగే అన్యాయాల పట్ల పట్ల చైతన్యం పరచాలన్నారు. గ్రేటర్ వరంగల్‌లో సుమారు 300 వరకు కళాశాలలు ఉన్నాయని అందులో 3000 పై చిలుకు వరకు బీసీ అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. వారందరినీ సమన్వయం చేసి అతి త్వరలో పెద్ద ఎత్తున ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రొఫెసర్ విజయ్ బాబు మాట్లాడుతూ రేపటి సమాజానికి మార్పు ఉపాధ్యాయులు అని రేపటి తరం కోసం అధ్యాపకులంతా పనిచేయాలన్నారు. టీజీపీఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ రాష్ట్ర నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. బీసీ రాష్ట్ర నాయకులు డాక్టర్ తిరునహరి శేషు మాట్లాడుతూ ప్రతిరోజు అనేకమంది విద్యార్థులకు పాఠాలు చెబుతున్నటువంటి అధ్యాపకులు బీసీ హక్కులను కూడా విద్యార్థులకు తెలియపరచి సంఘటితం చేయాలన్నారు. ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం బీసీలను వాడుకుంటున్నారని, దీనిపైన విస్తృతస్థాయిలో చర్చలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు డాక్టర్ మోటె చిరంజీవి, తాడిశెట్టి క్రాంతి కుమార్, వీరస్వామి, చేరాల సూర్యనారాయణ, కృష్ణమూర్తి, సతీష్, డా.అనిల్, ప్రో. సాంబయ్య, గూడూరు సుమన్, వీరగాని భాస్కర్, కాసర్ల మహేందర్, లక్ష్మణ్, శ్రీనివాస్, న్యాయవాది బండ వివేకానంద పాల్గొన్నారు.

# రాంపురం ఉద్యోగాలకు నెలవు

## ఆ ఊరు ఉపాధ్యాయులకు పుట్టినిల్లు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మండలంలోని ఆ గ్రామం మారుమూల పల్లెటూరే. వ్యవసాయం చేసుకుని.. కూలీ పనులకు వెళ్లి కుటుంబాలను పోషించుకునేవారు. కష్టాన్నే నమ్ముకుని జీవించేవారు. ఇప్పుడు ఆ ఊరు ఎనలేని ఖ్యాతిని గడిచింది. ఎంతో మంది విద్యావంతుల్ని తీర్చిదిద్దింది. ముఖ్యంగా ఆ గ్రామం నుంచి ఇటీవల ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఏడుగురికి ఉద్యోగాలు వచ్చాయి. అందులో నలుగురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. అందులో ఒకే ఇంటి నుంచి భార్య భర్తలకు ఇద్దరికి ఉద్యోగాలు రావడంతో వారి కుటుంబాలు ఆనందంలో మునిగిపోయాయి. మరిపెడ మండలం రాంపురం గ్రామం నుంచి ఇటీవలే ప్రకటించిన డీఎస్సీ ఫలితాలలో ఏడు ఉద్యోగాలు వచ్చిన వారిలో ఒకే ఇంటి నుండి భార్య కారింగుల చైతన్య, భర్త రాంపెల్లి శ్రవణ్ కుమార్ (ఎస్జీటీ), మేకల సునీత, (ఎస్జీటీ), దుబ్బకుల స్వప్న (ఎస్జీటీ), కృష్ణవేణి స్కూల్ అసిస్టెంట్, ఈరగాని రంజిత్ (ఎస్జిటీ), బోర రోష కృష్ణ (ఎస్జీటీ) లుగా ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.

# కేయూ దూరవిద్యా డిగ్రీ, పీజీ పునఃప్రవేశాలకు అవకాశం

## సంచాలకులు ప్రొఫెసర్ వి.రామచంద్రం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ కోర్సులలో గతంలో ప్రవేశాలు పొంది మధ్యలో ఆపివేసిన విద్యార్థులకు పునః ప్రవేశాలకు రీఅడ్మిషన్ అవకాశం కల్పిస్తున్నామని దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ వి. రామచంద్రం తెలిపారు. దూరవిద్యలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ విధానం అమలులోకి వచ్చింది. అందువల్ల గతంలో ఇయర్ వైస్ లో వివిధ డిగ్రీ, పీజీ కోర్సులలో ప్రవేశాలు పొందిన వారికి కోర్సులు పూర్తి చేయడానికి నిర్ణీత వ్యవధి ఉన్నందున ఈ అవకాశం కల్పిస్తున్నాం. సెమిస్టర్ విధానం మొదలైన తర్వాత ఒక సంవత్సరం వరకే ఇయర్ వైజ్ పరీక్షలు రాసి కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కాబట్టి, డిగ్రీ 2013-14 నుంచి పీజీ 2018-19 నుంచి ప్రవేశాలు పొందిన అన్ని బ్యాచ్ ల విద్యార్థులు ఈనెల అక్టోబర్ 30 వరకు రీ అడ్మిషన్ తీసుకోవడానికి అవకాశం ఉంది. ఇందుకోసం రీ అడ్మిషన్ ఫీజు, కోర్సు ఫీజు చెల్లించాలి. కాబట్టి, ఈ అవకాశం వినియోగించుకొని నవంబర్, డిసెంబర్ లో జరిగే పరీక్షలు రాసి కోర్సులు పూర్తి చేయగలరని దూరవిద్య సంచాలకులు ప్రొఫెసర్ వల్లూరి రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎఫ్‌సీఐలో బతుకమ్మ సంబురాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్రంలోని ఆడ బిడ్డలు ఆనందంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ వేడుకల నేపథ్యంలో మంగళవారం వరంగల్ కాజీపేటలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)ఆఫీస్ ఆవరణంలో మహిళా ఉద్యోగులు తీరొక్కపూలతో...బతుకమ్మలను పేర్చి...ఒక్కేసి పువ్వేసి చందమామా.. అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రఖార్ వర్మ మాట్లాడుతూ ఆఫీస్ లో ఆనందంగా పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మహిళా ఉద్యోగులు ఉద్యోగ బాధ్యతలు, ఒత్తిడిని మరిచి ఆనందంగా ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని ఎఫ్‌సీఐకి కొత్త శోభను తీసుకువచ్చారన్నారు. అనంతరం ఎఫ్‌సీఐ మహిళా మేనేజర్లు మాట్లాడుతూ ప్రకృతికే అందం మన బతుకమ్మ సంబరం..భారత దేశంలోని వివిధ రాష్ట్రాల వారు వృత్తి రిత్యా ఉద్యోగులు వస్తుంటారని, ఇలాంటి కార్యక్రమాలతో మన తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ మహిళా మేనేజర్లు దివ్య, మాధవి లత, జ్యోత్స్న, స్టాఫ్ సరిత, మనిషా, తదితరులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** యువత చెడు మార్గంలో పయనించకుండా వారి కాళ్లపై వారు నిలబడి కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏబీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు జిల్లాలోని 18 మండలాల నుంచి వేలాది మంది యువతీ, యువకులు ఈహాజరయ్యారు. 50 కంపెనీల నుంచి వచ్చిన ప్రతి నిధులకు అభ్యర్థుల ధృవ పత్రాలను పరిశీలించి, ఇంటర్వ్యూ లు చేసి అక్కడికక్కడే అభ్యర్థులను ఎంపిక చేసుకొని ఎస్పీ చేతుల మీదుగా నియామక పత్రాలను అందించారు. ఈ జాబ్ మేళాకు సహకరించిన వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

# దుర్గామాతకు ఎమ్మెల్యే జీఎస్సార్ పూజలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎస్‌పీటీ యూత్ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు చేశారు. నేడు దుర్గామాత శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, మాజీ జడ్పీటీసీ చల్లా చక్రపాణి, శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదు నాగరాజు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చింతల రవిపాల్, బాసని మార్కండేయ, ప్రపంచ రెడ్డి, వరదరాజు, మామిడి సుదర్శనం, దాసరి సదానందం, ఎస్ పీటీ యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సోద రామ కృష్ణ



**వరంగల్ వాయిస్, పరకాల :** రీజినల్ సెక్రెటరీ కే.నాగయ్య ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ వరంగల్ రీజియన్ పరకాల మున్సిపల్ చైర్మన్ సోద రామకృష్ణను పరకాల డిపోకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటికీ గౌరవ అధ్యక్షుడిగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక, విద్యావేత్త, రాజకీయ నాయకుడైన సోదా రామకృష్ణను నియమించడం పట్ల వివిధ కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేయడం జరిగిందని అన్నారు. వీరితో పాటు టీజీఎస్ ఆర్టీసీ పరకాల ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కమిటీ సెక్రటరీ ప్రసాద్, లౌడియా గోవర్ధన్ గౌరవ అధ్యక్షులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ పి.సూరయ్య, ఏడీసీ మాణిక్యం, ఏసు దాసు, బి.మోహన్ పాల్గొని గౌరవ అధ్యక్షులను అభినందించడం జరిగింది.

# వాహన తనిఖీలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** భూపాలపల్లి-పరకాల ప్రధాన రహదారి పై స్థానిక పీహెచ్సీ వద్ద సెకండ్ ఎస్ఐ ఈశ్వరయ్య వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహన చోదకులు ప్రతి ఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ వాహనానికి సంబంధించిన పత్రాలు వారి వెంట ఉంచుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చుని వాహనదారులకు తెలిపారు. ఎస్ఐతో పాటు కానిస్టేబుల్స్ , ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, శ్రీధర్, కిరణ్ సింగ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.





# రజనీకాంత్ సూచనతో ..

రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన చిత్రం 'వేట్టయన్' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఈ సినిమా కథ గురించి రజనీ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టి.జె.జ్ఞానవేల్ మొదట తీసుకువచ్చిన కథకు రజనీ మార్పులు సూచించారట. దానిలో కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయమని కోరారట. కుమార్తె సౌందర్య సిఫార్సు మేరకు రజనీకాంత్ 'వేట్టయన్' కథను విన్నట్లు చెప్పారు. 'టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో వచ్చిన 'జైభీమ్' సినిమా నాకెంతో నచ్చింది. కానీ, గతంలో జ్ఞానవేల్‌తో ఎప్పుడూ మాట్లాడే అవకాశం రాలేదు. 'వేట్టయన్' కథ వినమని సౌందర్య నాకు చెప్పడంతో విన్నాను. బాగుందనిపించింది. అయితే, ఈ సినిమా తీయడానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. అందుకే కథలో కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలని కోరాను. 10 రోజుల సమయం అడిగాడు. 'కమర్షియల్ సినిమాగా మారుస్తాను. కానీ, నెల్సన్ దిలీప్‌కుమార్, లోకేశ్ కనగరాజ్‌ల సినిమాగా మార్చలేను. నా శైలిలో ప్రేక్షకులకు నచ్చేలా ఈ కథను మారుస్తాను' అని జ్ఞానవేల్ చెప్పాడు. 10 రోజుల తర్వాత కథలో మార్పులు చేసి తీసుకొచ్చాడు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను' అని రజనీకాంత్ తెలిపారు. ఈ సినిమాకు అనిరుధ్ మాత్రమే సంగీత దర్శకుడిగా ఉండాలని జ్ఞానవేల్ పట్టుపట్టినట్లు రజనీ గుర్తుచేసుకున్నారు. ఇది రజనీకాంత్‌కు 170వ చిత్రం. ఆయన ఇందులో రిటైర్డ్ పోలీసు అధికారిగా కనిపించనున్నట్టు సమాచారం. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికాసింగ్, మంజు వారియర్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. తెలుగులోనూ అదే పేరుతో విడుదల కానుంది.




# దసరాకు కాదు... దీపావళికి

## గేమ్ చేంజర్ టీజర్ డేట్ ఛేంజ్

రామ్‌చరణ్` శంకర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్' టీజర్ దసరాకు రావడం లేదు. దీపావళికి వస్తుందని తాజాగా దీనిపై సంగీత దర్శకుడు తమన్ పోస్ట్ పెట్టారు. టీజర్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దసరాకు టీజర్ రాలేదని నిరాశపడొద్దు ఫ్రెండ్స్. టీమ్ నిరంతరం ఆ పనుల్లోనే ఉంది. ప్రతినెలా ఒక లిరికల్ పాటను విడుదల చేయడం కోసం అన్ని పాటలకు లిరిక్స్ వర్క్స్ పూర్తి చేశాం. ఈ నెలలో అక్టోబర్ 30న ఒక పాట రానుంది. సినిమా డిసెంబర్ 20న కచ్చితంగా మీ ముందుకువస్తుంది' అని పోస్ట్ పెట్టారు. 'రా మచ్చా..' సాంగ్ వంద మిలియన్ల వ్యూస్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇక ఓ నెటిజన్‌కు రిప్లై ఇస్తూ.. దీపావళికి టీజర్ ఉంటుందన్నారు. 'దీని టీజర్ కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని మేం అర్థం చేసుకోగలం. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. అవుట్‌పుట్ కోసం ఎక్కడా రాజీపడడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. దసరాకు విడుదల కాకపోతే దీపావళికి టీజర్ ఉంటుంది. దీనికి సంబంధించిన అప్‌డేట్స్ నేను ఎప్పటికప్పుడు అందిస్తుంటాను. మీరంతా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా' అని అన్నారు. 'గేమ్ ఛేంజర్' విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలు సినిమాపై అంచనాలు పెంచాయి.



# వెంకీ మూవీ సీక్వెల్ పై శ్రీను వైట్ల ఆసక్తి

రవితేజ హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీ' 2004లో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడమే కాదు.. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అందులోని పలు సన్నివేశాలను తలచుకోవడమే ఆలస్యం ప్రేక్షకుల ముఖాల్లో నవ్వులు పూస్తాయి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ ఏ హీరోతో చేస్తారనే ప్రశ్నకు శ్రీను వైట్ల సమాధానమిచ్చారు. ఆయన తాజా చిత్రం 'విశ్వం' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో 'వెంకీ' గురించి మాట్లాడారు. వెంకీ' సీక్వెల్ ఎవరితో చేస్తాననేది చెప్పడం కష్టం. అందులో నటించే హీరో కచ్చితంగా నాకు మంచి స్నేహితుడై ఉండాలి. రవితేజ నాకు మంచి ఫ్రెండ్ కాబట్టి ఆ సినిమా అంత బాగా వచ్చింది. నేను ఏ హీరోతో చేసినా వాళ్లు నాకు స్నేహితులు అవుతారు. అలాంటి రిలేషన్ ఉన్నప్పుడే సినిమా బాగా వస్తుంది. ప్రస్తుతం చాలామంది టాలెంటెడ్ హీరోలు ఉన్నారు. వాళ్లందరూ కామెడీతో అలరిస్తున్నారు. వాళ్లలో ఎవరికైనా దీని సీక్వెల్ సెట్ అవుతుంది. ఒకరి పేరు చెప్పడం కష్టం అని చెప్పారు. 2004 మార్చి 26న విడుదలైన వెంకీ సంచలనం సృష్టించింది. రవితేజ పోషించిన వెంకీ పాత్ర, హీరోయిన్ స్నేహ నటించిన శ్రావణి పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించుకున్నాయి. హీరో ఫ్రెండ్స్ గ్యాంగ్ అలాగే గజాలాగా బ్రహ్మానందం, బొక్కా సుబ్బారావుగా ఏవీఎస్.. ఇలా ప్రతిఒక్కరూ వారి కామెడీతో అదరగొట్టారు. ముఖ్యంగా ట్రైన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ సినిమా దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. దీనికి సీక్వెల్ రావాలని ఎంతోమంది కోరుకుంటున్నారు.

# శరవేగంగా షూటింగ్..

మూడేళ్ళుగా బన్నీ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం పుష్ప 2..అనేక కారణాల వల్ల ఈ సినిమా షూట్ ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సుకుమార్ సినిమాని జెట్ స్పీడ్‌లో ముందుకు తీసుకెళ్తున్నాడు. ఓ వైపు గ్లిమ్ప్స్, సాంగ్స్ అప్డేట్స్‌కి మంచి ఆదరణ లభించగా.. మరో రెండు వండర్ ఫుల్ అప్డేట్స్ ఫ్యాన్స్‌లో జోష్ పెంచుతున్నాయి. పుష్ప మేకర్స్ ఇప్పటికే ఈ సినిమాని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో షూటింగ్ లో వేగం పెంచిన దర్శకుడు సుకుమార్.. ఫస్ట్ హాఫ్ ఎడిట్ కాపీని లాక్ చేశారట. ఇక సెకండ్ హాఫ్ లో మిగిలి ఉన్న కొన్ని సన్నివేశాల షూట్ కోసం మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇందులో ఒక యూనిట్ రంపచోడవరంలో పని చేస్తుండగా మరో రెండు యూనిట్లు వైజాగ్, యానాంలో పని చేస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా రిలీజ్ దగ్గరపడటం, షూటింగ్ చకచకా సాగుతుండటం అభిమానులలో జోష్ పెంచింది. పుష్ప 1లో ఉన్న క్యారెక్టర్లనే ఈ సినిమాలో కొనసాగిస్తుండగా జగపతి బాబు అడిషినల్‌గా యాడ్ అయ్యారు. ఇక సినిమాలో ఒక ప్రత్యేకమైన ఐటమ్ సాంగ్ కోసం మొదట శ్రీలీలను సంప్రదించిన దిశా పటానిని ఓకే చేశారు.





# భవానీమాతగా.. అమ్మవారు

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- తెప్పోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన మేయర్ సుధారాణి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవిశరన్నవరాత్రులు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉదయం



నిత్యహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని భవానీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపించారు. భవాని మాతను దర్శించుకోవడం ద్వారా సమస్త భోగాలు కలుగుతాయి. ఈ రోజు అమ్మవారికి కాత్యాయని క్రమంలోను, భోదాయనమహర్షి ప్రోక్త నవరాత్రా కల్పాన్ని అనుసరించి ధూమ్రహా క్రమంలోను పూజారాధనలు జరిపారు. సాయంకాలం సాలభంజిక సేవ జరిపారు. నగర మేయర్ గుండు సుధారాణి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అమ్మవారి తెప్పోత్సవం సందర్భంగా భద్రకాళి చెరువులో గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తదుపరి యాదగిరిగుట్ట ఛైర్మన్ భాస్కరాయని నరసింహ మూర్తి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పూజనంతరం ఉభయ దాతలకు ఆలయ ఈఓ శేషుభారతి శేష వస్త్రములు బహుకరించి ప్రసాదములు ఆందజేశారు. సాయంకాలం నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా హరికథ, భక్తి సంగీతం, కర్నాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి.

# డ్యూటి మీట్ ద్వారా వృత్తి నైపుణ్యం



- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ
- అధికారులకు పతకాల బహుకరణ

**వరంగల్ వాయిస్, క్రైం :** డ్యూటీ మీట్ పోటీల్లో పాల్గొనడం ద్వారా పోలీస్ అధికారులు తమ వృత్తిలో మరింత రాణించగలరని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. ఇటీవల మూడు రోజల పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయములో నిర్వహించిన జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో విజయం సాధించిన పోలీస్ అధికారులకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా మంగళవారం పతకాలను బహుకరించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ కమిషనరేట్, ఖమ్మం, కమిషనరేట్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ఈ నెల మూడో తేది నుంచి మూడు రోజుల పాటు వరంగల్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో నిర్వహించారు. అధికారులు రోజువారి నిర్వహించే విధులుకు సంబంధించి 18 విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పతకాలను అందజేసారు. ఈ పోటీల్లో రాణించిన అధికారులున హైదరాబాద్‌లో ఈ నెలలో జరిగే తొలి తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా నేరస్థులను గుర్తించడం సులభం కావడంతో పాటు నిందితులకు శిక్షలు పడుతాయని, ఆలగే బాధితులను న్యాయం చేసినవారమవుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్రతో పాటు ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళా సంఘాలకు అద్దె బస్సులు

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ద్వారా బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో..మహిళా సంఘాలకు ఉపాధి కల్పిస్తూ వారి ద్వారా కొనుగోలు చేసిన బస్సులను హైర్ చేసుకోవాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలన్న నిర్ణయానికి వచ్చింది. మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆధ్వర్యంలో రవాణా శాఖ, పీఆర్ ఆర్డీ ఉన్నాధికారుల సమావేశం జరిగింది. మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సుల కేటాయింపు విధి విధానాలపై చర్చలు జరిపారు. రవాణా శాఖ స్పెషల్ సెక్రటరి వికాస్ రాజ్, కమిషనర్ ఇలంబర్తి, పీఆర్ ఆర్ డీ సెక్రటరి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, టీజీ ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు. మొదటి విడతలో ప్రయోగాత్మకంగా రెండు జిల్లాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ అద్దె బస్సులను కేటాయించాలని నిర్ణయించారు. సీఎం సొంత జిల్లా మహబూబ్ నగర్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లా కరీంనగర్ లను ఇందుకు గాను ఎంపిక చేశారు. మొదటి విడతలో 100 నుంచి 150 బస్సులను మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారు. మహిళా సంఘాలు కొనుగోలు చేసే ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతల కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, నిర్వహణ ఖర్చు తదితర అంశాలన్నింటితో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.

# మెరుగైన వైద్యం అందించాలి

## ధర్మసాగర్ పీహెచ్ సీ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఓపి విభాగంతో పాటు వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, టీకా గది, రోగుల వార్డ్, ఆరోగ్య కేంద్రం పరిసరాలను తనికీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవల కోసం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు, వారి సహాయకులతో అక్కడ అందుతున్న వైద్య సదుపాయాలను గురించి కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలను అందించాలన్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైన ఇబ్బందులు ఉన్నట్లయితే తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.





### వనరుల కల్పనకు చర్యలు..

ధర్మసాగర్ శాఖా గ్రంథాలయంలో అవసరమైన వనరుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు.మంగళవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ శాఖా గ్రంథాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ అందుబాటులో ఉన్న పుస్తకాలు, ఇతర సదుపాయాలను గురించి లైబ్రేరియన్, పాఠకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గ్రంథాలయానికి కావల్సిన అదనపు వనరులకు ప్రతిపాదనలు అందజేస్తే అందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఓ శ్రీనివాస్ కుమార్, స్థానిక తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com